క్లుప్తంగా

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నారాయణవనం: ప్రతి నెలా విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ జయ ప్రకాష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్తగా జారీ చేసిన నిబంధనల మేరకు విద్యుత్ బిల్లులను వినియోగదారులు 15వ తేదీలోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. తర్వాత చెల్లించే బిల్లులకు 3 శాతం అపరాధ రుసుంను సర్‌చార్జిగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. బిల్లును అదే నెలలో చెల్లించకుంటే ముందస్తు నోటీసులు లేకుండా కనెక్షన్లను తొలగించాల్సి ఉంటుందన్నారు. మరుసటి నెల బిల్లులో సర్‌చార్జి, రీ కనెక్షన్ చార్జీ కింద రూ.100 మరుసటి నెల బిల్లులో కలిపి వినియోగదారులకు అందిస్తామన్నారు. తొలగించిన కనెక్షన్ల బకాయి బిల్లులను పూర్తిగా చెల్లించిన తరువాతే సరఫరా పునరిద్ధరిస్తామని చెప్పారు.

ఎన్నికలపై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఐదో తరగతి విద్యార్థులకు ఎన్నికలు ఎలా జరపాలి అనే అంశంపై బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభావతి, ఉపాధ్యాయులు కోటికుమారి, నాగ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను, వాటర్‌క్యాన్ వితరణ

నారాయణవనం: మండలంలోని డీకే పాళెంలో అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాను, ట్యూబ్ లైట్, వాటర్ క్యాన్‌ను సర్పంచ్ స్వర్ణ మంగళవారం అందజేశారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బందికి ట్యూబ్‌లైట్, ఫ్యానుతో పాటు పిల్లలు శుభ్రమైన నీటిని తాగడానికి వాటర్ క్యాన్‌ను అందజేసినట్లు సర్పంచ్ స్వర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

శ్రీకాళహస్తి: సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఇంటిపన్నులు, ఖాళీ స్థలాలకు పన్నులు, కొళాయి పన్నులు, మార్కెట్ లీజు, షాపు రూముల బాడుగులను వెంటనే చెలించాలన్నారు.

కార్మికుడికి గాయాలు


గాయపడిన మునిరామయ్య

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు మలుపులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ జయచంద్ర కథనం మేరకు.. మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన మునిరామయ్య(53) డిక్షన్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విధులు నిర్వహించడానికి ఇంటి నుంచి కార్మికుడు సైకిల్‌పై బయలుదేరాడు. ఎండీపుత్తూరు మలుపులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో మునిరామయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు తొలగింపు


మురుగును తొలగిస్తున్న జేసీబీ

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎస్టీ కాలనీలో పేరుకుపోయిన మురుగును మంగళవారం తొలగించారు. ఐదు నెలలుగా కాలనీలో మురుగునీటి కాలువల్లో మురుగు పేరుకుపోయింది. దీంతో దోమలు వృద్ధి చెందాయని కాలనీవాసుల విన్నం మేరకు పంచాయతీ అధికారులు జేసీబీతో మురుగును తొలగించి సమస్యను పరిష్కరించారు.

అబాకస్ పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ పాఠశాల విద్యార్థి అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపాడు. పట్టణంలోని ఓ పాఠశాలలో ఏడో తరగతి చదివే మనోజ్‌కుమార్ గత నెల 22వ తేదీన అబాకస్ మెంటల్ అర్థమెటిక్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా ఆరో లెవల్‌లో మొదటి స్థానం సాధించాడు. ఈ విద్యార్థిని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలోచన ఘనమైనదే.. ఆచరణే అస్తవ్యస్తంగా ఉంది. పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న నేటి తరుణంలో చెత్త నుంచి సంపద సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ఇందుకోసం నిర్మించిన చెత్త సంపద కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అవి పలు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా సంపద సృష్టి లక్ష్యం నీరుగారిపోయి.. పల్లెకు ఆర్థిక పరిపుష్టి కొరవడుతోంది.

వరదయ్యపాళెం మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రం



సంపద సృష్టి..

లేదు పల్లెకు పరిపుష్టి

- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- మెజారిటీ కేంద్రాల్లో కానరాని నిర్వహణ
- తయారుకాని వర్మీకంపోస్ట్

వరదయ్యపాళెం: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో 165 పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్మాణానికి రూ.7.095 కోట్లు స్వచ్ఛభారత్ మిషన్ నిధులు ఖర్చు చేశారు. గ్రామాల్లో రోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి, పొడి చెత్తతోపాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను రిక్షాల ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలించి, అక్కడ తడి, పొడి చెత్తను వేరుగా కుండీల్లో వేసి వర్మీ కంపోస్ట్(సేంద్రీయ ఎరువు) తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించడం, అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను స్క్రాప్ దుకాణాలకు విక్రయించి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నదే ఈ కేంద్రాల లక్ష్యం. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లక్ష్యం నీరుగారుతోంది. నియోజకవర్గంలోని 165 కేంద్రాల్లో కేవలం 15 నుంచి 20 పంచాయతీల్లో మాత్రమే పూర్తిస్థాయిలో కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన చోట్ల అలంకారప్రాయంగా మారాయి. కొన్ని కేంద్రాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి. అధికారుల స్పందించి తక్షణమే కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండలాల వారీగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల వివరాలు

మండలం	సంపద కేంద్రాలు
నారాయణవనం	18
కేవీబీపురం	29
పిచ్చాటూరు	21
నాగలాపురం	19
బీఎన్‌కండ్రిగ	24
సత్యవేడు	28
వరదయ్యపాళెం	26

వినియోగంలోకి తెస్తాం



“మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిరుపయోగంగా ఉన్న వాటిని తక్షణమే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేయించి, రైతులకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

–ప్రసాద్, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

రక్షణ గోడ నిర్మించాలి


ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని నేతాజీ రోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువపై రక్షణగోడ నిర్మించాలని బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బి. మోహన్ బాబు కోరారు. మంగళవారం వారు ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత నెలలో రెండు పర్యాయాలు విద్యార్థులు సైకిల్‌పై వెళుతూ మురుగు కాలువలో పడి ప్రమాదాలకు గురయ్యారన్నారు. మలుపులో భారీ వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కల్వర్టుపై శ్లాబు వేసి అడ్డు గోడ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్‌కు వినతిపత్రాన్ని పంపిస్తామని తెలిపారు. త్వరితగతిన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

మత్తుతో జీవితం చిత్తు


మాట్లాడుతున్న జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : యువత మత్తుకు బానిసై జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు నారాయణరెడ్డి, మంజుల తెలిపారు. మంగళవారం స్థానిక టీపీపీఎం హైస్కూల్‌లో నెహ్రూ యువజన కేంద్రం సహకారంతో ప్రజా సాధికారిక ట్రస్టు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం–దుష్పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మేధస్సు, నైపుణ్యంతోనే ఎంచుకున్న రంగాల్లో రాణించగలరని వెల్లడించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడిన యువత చెడు మార్గంలోకి వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వాడకానికి అలవాటు పడి పెడదారి పడుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ రాంబాబు, ట్రస్టు అధ్యక్షుడు బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం వెలుపల జస్టిస్ భాస్కర్ రెడ్డి

తిరుమల : శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర మంగళవారం తెలిపారు. ఈ నెల18న పల్లం, చింతలపాళెం, ఏర్పేడు, సరస్వతికండ్రిగలోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు 13 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని విలువైన రాగి తీగలను చోరీ చేసినట్లు చెప్పారు. వీటివిలువ రూ.65 వేలు ఉంటుందన్నారు. రైతుల సమాచారం మేరకు ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య ఫిర్యాదుతో గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళం

వరదయ్యపాళెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష నగదును టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం ఇచ్చారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 64,894 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,355 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.82 కోట్ల ఆదాయ వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

మలుపులు.. ప్రమాద నిలయాలు


ముసలిపేడు మార్గంలోని మలుపు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్అండ్‌బీ రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరస్వతికండ్రిగ, ముసలిపేడు, విక్రమాల, ఎండీ పుత్తూరు, కోబాక, అంజిమేడు క్రాస్ రోడ్డు, బండారుపల్లె, మన్నసముద్రం తదితర గ్రామాల రోడ్లలోని మలుపుల్లో దట్టమైన ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. నిరంతరం రోడ్లపై బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఈ మలుపుల్లో పలు ప్రమాదాలు జరిగి పలువురు ద్విచక్ర వాహనచోదకులు గాయపడ్డారు. పలుసార్లు సమస్యపై ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించి ప్రమాదాలు నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆధునిక సాంకేతికత అందిపుచ్చుకోవాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

సత్యవేడు: వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని ఏఓ మురళి కోరారు. మంగళవారం మండలంలోని రాజగోపాలపురం, వానెల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాలపురంలో సర్పంచ్ మధురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఓ మురళి మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవశాయశాఖ, అనుబంధ శాఖలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో రైతుల సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు రూపేష్, వెటర్నరీ జూనియర్ అసిస్టెంట్ కుసుమ పాల్గొన్నారు.

నిరుపయోగంగా శౌచాలయాలు


ప్రభుత్వాస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారితో పాటు బంధువులు, సహాయకులు వస్తుంటారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మించారు. అయితే వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. మరుగుదొడ్లు ప్రారంభిస్తే రోగుల బంధువులు వాడుకునే అవకాశం ఉంటుందని ఆస్పత్రికి వచ్చేవారు చెబుతున్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రాఘవేంద్రస్వామి మఠం పక్కన రూ.36 లక్షలతో, టూరిస్టు బస్టాండ్ వద్ద రూ.18 లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. అయితే వాటిని ప్రారంభించకపోవడంతో అది నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు కొత్తగా నిర్మించిన బాత్‌రూమ్‌లతోపాటు మరుగుదొడ్లను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఉచిత పశు వైద్యశిబిరానికి విశేష స్పందన


పాడి ఆవును పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

రేణిగుంట: వెంకటాపురంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాస్ కేవీకే వెటర్నరీ డాక్టర్ అనూష ఈ సందర్భంగా ఆవులు, గేదెలు, దూడలకు పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పశువుకు నట్టల నివారణకు మందు తాగించాలని, పిడుదులకు మందు పిచికారి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిప్రసాద్, అన్బలగన్, శంకరయ్య, నాగమణి, ఇందుమతి, జ్యోతి, స్వాతి, ట్రస్టీ రమేష్ రెడ్డి, క్లస్టర్ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో ఉచిత సేవలు


భక్తులకు బొట్టు పెడుతున్న ఉచిత సేవకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సేవకులు విస్తృతంగా తమ సేవలు అందజేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు గంధం, విభూతి, కుంకుమతో బొట్టు పెడుతున్నారు. ఆలయ ఆవరణలోకి వస్తున్న భక్తులను పిలిచి మరీ బొట్టు పెట్టి, వారిలో భక్తి భావం పెంచుతున్నారు. చంద్రశేఖర్ ఆజాద్ ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు చేపట్టిన తరువాత కొన్ని మార్పులు జరుగుతున్నాయి. అందులో బొట్టు పెట్టడం కూడా ఒకటిగా చెప్పుకోవచ్చు.

వృత్తి ఉద్యోగం.. ప్రవృత్తి సేకరణ


- నాణేలు, స్టాంపులు, పెన్నుల సేకరణ
- స్టాంపుల' రాజేష్‌గా సుపరిచితుడు



జాతీయ జెండా ఉన్న పోస్టల్ స్టాంపు

ఆయన చిరుద్యోగి. ఆదాయం అంతంత మాత్రం. అయితే అరుదైన నాణేలు, స్టాంపులు, పెన్నుల సేకరణే ఆయన అభిరుచి. ఈ క్రమంలోనే కొన్ని ఏళ్ల కిందటి నాణేలు, స్టాంపులు, పెన్నులు సేకరించి భద్రపరిచాడు. వేతనం స్వల్పమే అయినా.. అందులోనూ కొంత అరుదైన వస్తువుల సేకరణకు వినియోగిస్తున్నాడు. అందుకే ఆయన స్టాంపుల రాజేష్‌గా ప్రజల మనస్సు దోచుకున్నాడు.

సత్యవేడు: గుమ్మడి పూండికి చెందిన రాజేష్ సత్యవేడు మండలంలోని శ్రీసిటీ పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆయన నెలకు రూ.10 వేల జీతానికి పనిచేస్తున్నారు. అయినా ఆయన స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు వచ్చిన అరుదైన పోస్టల్ స్టాంపులు కొన్నింటిని సేకరించాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే మన జాతీయ జెండాతో విడుదలైన స్టాంపుతోపాటు రాష్ట్రానికి చెందిన తిరుమల అందాలు, తెలుగుతల్లి, గురజాడ అప్పారావు, అన్నమాచార్య, దామోదర సంజీవయ్య, ఎన్టీ రామారావు, ఎంఎస్ సుబ్బలక్ష్మి, వీవీ గిరి, పట్టాభి సీతారామయ్య, పొట్టి శ్రీరాములు ఇలా పలువురు నాయకులు, విశిష్ట వ్యక్తుల చిత్రాలతో విడుదలైన పలు స్టాంపులను ఆయన సేకరించారు.




'గాంధీజీ స్టాంపు సేకరణే జీవితాశయం

తన యుక్త వయస్సులో చెడు అలవాట్లుకు దూరం చే సుకునే క్రమంలో తాను అరుదైన వస్తువుల సేకరణ ను హాబీగా మార్చుకున్నాను. ప్రస్తుతం ఓ ప్రైవేటు కంపెనీలో చిరుఉద్యోగిగా పనిచేస్తున్నాను. అరుదైన వస్తువుల సేకరణకు రూ.వేలు ఖర్చు చేస్తున్నాను. జాతిపిత మహాత్మాగాంధీకి సంబంధించిన వివిధ దేశాల్లో ఉన్న స్టాంపులు, కరెన్సీ, ఇతర వస్తువుల సేకరణే నా జీవితాశయం.

– రాజేష్, ఉద్యోగి, శ్రీసిటీ





రాజేష్ సేకరించిన అరుదైన స్టాంపులు

అన్నప్రసాద కేంద్రంలో తనిఖీలు


తనిఖీ చేస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల : మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. భోజనం రుచి, నాణ్యత గురించి భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలని వినతి

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పేదలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ టీటీడీ పరిపాలన భవనం ఎదుట 62 రోజులుగా సమస్య పరిష్కారం కోసం నిరసన దీక్షలు చేస్తున్నారని వెల్లడించారు. 31 కుటుంబాల వారు సుమారు 15 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వెళుతున్న శ్రీవారి భక్తులకు అన్నపానీయాలు అందిస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ పేద కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈఓ స్పందించి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర శ్రీవారి మెట్టు వ్యాపారుల సంఘం నేతలు మధు, చిట్టిబాబు, యుగంధర్ పాల్గొన్నారు.